క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

సిరిసిల్లటౌన్: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును శనివారం లబ్ధిదారుడికి అందజేశారు. పెద్దూర్‌లో కడమంచి లింగమయ్య రామచంద్రన్‌కు రూ.6వేల చెక్కు మంజూరైంది. ఆదివారం 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ అందజేశారు. మాజీ సర్పంచ్ ఆదిపెల్లి లక్ష్మీదేవగౌడ్, గండ రమేశ్‌రావు, లద్దు దేవయ్య, రాచర్ల దేవేందర్, గొర్రె శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

బోయినపల్లి: మండల కేంద్రంలో వచ్చే విద్యా సంవత్సరానికి డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. డిగ్రీ కళాశాల అందుబాటులో లేక, పేద ప్రజలు ఫీజులు చెల్లించి ప్రైవేటు కళాశాలల్లో చదివించలేక మధ్యలో చదువు ఆపేస్తున్నారని పేర్కొన్నారు.

పరామర్శ

తంగళ్లపల్లి: జిల్లెల్ల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఉడుతల రాజయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా.. ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని పరామర్శించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, బైరినేని రాము, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

హైమాస్టు లైట్లు ప్రారంభం

తంగళ్లపల్లి: ఇందిరానగర్ భరత్‌నగర్ గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో హైమాస్టు లైట్లు ప్రారంభించారు. మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని మాట్లాడుతూ.. పల్లెల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందని పేర్కొన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, భాను, నాగరాజు, రాజు, బైరినేని రాము, భరత్‌గౌడ్, మల్లేశ్‌యాదవ్, తిరుపతిగౌడ్, నరేశ్, వెంకటమాధవరెడ్డి, హరీశ్, రమేశ్, యాదగిరి పాల్గొన్నారు.

కేకేను విమర్శించే స్థాయి లేదు

ముస్తాబాద్: తెలంగాణవాది, సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని కాంగ్రెస్ యువజన శాఖ మండల అధ్యక్షుడు రంజాన్ నరేశ్ అన్నారు. ముస్తాబాద్ కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఎన్ఎస్‌యూఐ సిరిసిల్ల వర్కింగ్ ప్రెసిడెంట్ మిడిదొడ్డి భాను, వెంకటేశ్, నవీన్, మహేశ్, సురేశ్ తదితరులున్నారు.

నిరుపేద వైద్యానికి ఆర్థిక సాయం

గంభీరావుపేట: మండల కేంద్రంలోని దోసల గూడెంకాలనీకి చెందిన వీర్నపల్లి నర్సింలు ఇటీవల కాలు జారి కింద పడ్డాడు. కాళ్లు విరిగాయి. నిరుపేద కావడంతో వైద్య ఖర్చుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఈక్రమంలో రైల్వే ఉద్యోగుల సంస్థ(రైల్వే హెల్పింగ్ హ్యాండ్స్) కరీంనగర్ వారు రూ.5వేల ఆర్థిక సాయం ఆదివారం నర్సింలుకు అందించారు. సంస్థ ప్రతినిధులు పెద్ది శ్రీనివాస్, బండ రవికుమార్, స్థానిక నాయకులు దోసల శంకర్, రవి, రాజ్‌కుమార్, సుభాష్, నవీన్ పాల్గొన్నారు.

కామధేను అవార్డు అందజేత



సిరిసిల్లటౌన్: సీనియర్ జర్నలిస్ట్ పాడిచేటి వంశీకృష్ణ 2024 ఏడాదికి గాను విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ కామధేను అవార్డు అందుకున్నారు. పాత్రికేయ రంగంలో బెస్ట్ సీనియర్ కంటెంట్ రైటర్ కేటగిరిలో ఈ పురస్కారం ఆయనకు దక్కింది. శనివారం హైదరాబాద్ బేగంపేట్‌లోని టూరిజం ప్లాజా వేదికగా అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.నంద చేతుల మీదుగా వంశీకృష్ణ పురస్కారాన్ని అందుకున్నారు. ఆయనకు జిల్లా ప్రముఖుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి.

సీఎంను కలిసిన యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు

బోయినపల్లి: జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా 9,314 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించిన రత్నంపేట గ్రామానికి చెందిన డాక్టర్ కొడగాని వెంకటేశ్ సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న రోజుల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు మంచి భవిష్యత్తు ఉంటుందని సీఎం ఈ సందర్భంగా చెప్పినట్లు వెంకటేశ్ తెలిపారు.

ఎంఏఏ కార్యవర్గం

సిరిసిల్లటౌన్: మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్(ఎం.ఎ.ఎ.) జిల్లా అధ్యక్షుడిగా వేములవాడకు చెందిన సంగ స్వామియాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా చింతలపల్లి మునీందర్‌రెడ్డి, చీఫ్ ప్యాట్రన్‌గా ఎల్లాల రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా గడ్డం సత్యనారాయణరెడ్డి, గొట్టె శేఖర్, జాయింట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ డాక్టర్ లక్ష్మణ్, క్యాషియర్ నాయిని శంకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ కటకం చంద్రయ్య, మహిళా విభాగం జనరల్ సెక్రటరీ రామాంజమ్మ, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా బెహల ఎన్నికయ్యారు.

పని చేయని తాగునీటి బోర్లు



ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని వివిధ వార్డుల్లో మంచినీటి బోరు బావుల మోటార్లు చెడిపోయి మంచినీటి కోసం మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని నయీమ్ ఇంటి వద్ద ఉన్న మంచినీటి బోరు, అనంతారం రోడ్డు వైపున ఉన్న మంచినీటి బోరు, గౌడ సంఘం వద్ద ఉన్న మంచినీటి బోరు మరమ్మతుకు గురయ్యాయి. నయీమ్ డీలర్ ఇంటి వద్ద ఉన్న బోరు కాలి నడవక మోటార్‌ను బయటకు తీసే ప్రయత్నంలో మట్టి కూలి మధ్యలో మోటార్ ఇరుక్కుపోయింది. బోరు పని చేయని పరిస్థితిలో ఉంది. దాని స్థానంలో కొత్త బోరు వేయడానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అనుమతివ్వడంతో.. ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. అనంతారం రోడ్డు వైపున్న బోరు మోటార్ కాలిపోవడంతో మహిళలు మంచినీటి కోసం నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అయ్యప్ప భక్తి పాట ఆవిష్కరణ



వేములవాడ/వేములవాడరూరల్: పట్టణానికి చెందిన కళాకారుడు మారం ప్రవీణ్‌కుమార్ నటించిన అయ్యప్ప భక్తి పాట ఘనంగా ఆవిష్కరించారు. రాష్ట్ర ఉద్యమ కళాకారుల విభాగం అధ్యక్షుడు ఎల్ల పోశెట్టి, కొండ నర్సయ్య, కౌన్సిలర్ మారం కుమార్, ఆలయ మాజీ ధర్మకర్త అరుణ్‌తేజాచారి భక్తి పాటను ఆవిష్కరించారు. అయ్యప్ప పాట సీడీ లోగోను జెడ్పీ మాజీ చైర్మన్ తీగల రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకుడు ముప్పిడి శ్రీనివాస్ ఆవిష్కరించారు. నిర్మాత అంజియాదవ్, నటుడు మారం ప్రవీణ్, దర్శకుడు రఘుజాన్, కెమెరామెన్ శివ వేల్పుల, కొరియోగ్రాఫర్ గంగా శ్రీకాంత్, నాయకుడు శీలం విజయ్‌యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

అయ్యప్ప స్వాముల మహాపాదయాత్ర



గంభీరావుపేట: గంభీరావుపేట మండలానికి చెందిన అయ్యప్ప స్వాములు ఆదివారం మహా పాదయాత్ర చేపట్టారు. మండల కేంద్రంలోని అయ్యప్ప సన్నిధానం నుంచి ముస్తాబాద్‌లోని అయ్యప్ప సన్నిధానం వరకు ఈ పాదయాత్ర ఉంటుందని అయ్యప్ప స్వాములు తెలిపారు. ప్రతి ఏటా ఈ మహా పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. గురుస్వాములు నాగరాజు, మహేశ్, బాబు, బాలకృష్ణ, సంతోష్, నర్సింహారాజు, నాగరాజు, గణేశ్, వెంకటేశ్, శివ, నవీన్, భాను, రాజేశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలందేదెప్పుడో?

- ప్రారంభించినా వినియోగంలోకి రాని ఆరోగ్య ఉప కేంద్ర భవనాలు
- అద్దె భవనాల్లోనే వైద్య సేవలు
- ఉప కేంద్రాల్లో కానరాని సిబ్బంది
- ప్రజలకు తప్పని తిప్పలు

కోనరావుపేట: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రాలకు మోక్షం కలగడం లేదు. ఉప కేంద్రాలను ప్రారంభించి సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ వినియోగంలోకి రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా నాలుగు ఉప కేంద్రాలు నిర్మించి ప్రారంభించినా ఫలితం లేకుండా పోయింది.

నిధులు మంజూరు..

కోనరావుపేట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో 28 గ్రామాలు ఉన్నాయి. ఆరోగ్య కేంద్రంతోపాటు 8 ఉప కేంద్రాలు కొనసాగుతున్నాయి. నిమ్మపల్లి, ధర్మారం, నిజామాబాద్ గ్రామాల్లో ఉప కేంద్రాలకు సొంత భవనాలుండగా.. మిగతా 5 ఉప కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మండలంలో ఐదు ఉప కేంద్రాలకు ఒక్కోదానికి రూ.20లక్షలు మంజూరు కాగా.. మామిడిపల్లి, వట్టిమల్ల, కోనరావుపేట, సుద్దాలలో పనులు పూర్తి చేసి నాలుగు గ్రామాల్లో ప్రారంభం చేశారు. కొలనూర్‌లో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

పనుల్లో నాణ్యతాలోపం

కోనరావుపేట మండలంలోని గ్రామాల్లో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రాల్లో నాణ్యతాలోపం కనబడుతోంది. వట్టిమల్లలో నిర్మించిన ఉప కేంద్రానికి వాడిన సిమెంట్ ఇటుకలు నాణ్యత లేకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మామిడిపల్లిలో భవనం నిర్మించినా ముగింపు పనుల కోసం మరో రూ.4లక్షలు మంజూరు చేశారు. సుద్దాల, కోనరావుపేట గ్రామాల్లో పనులు పూర్తయ్యాయి. కొలనూర్‌లో పనులు మధ్యలోనే నిలిచాయి. అయితే అన్ని గ్రామాల్లో నిర్మించిన ఉప కేంద్ర భవనాల్లో నాణ్యతాలోపాలున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

సిబ్బంది కరువు

గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాల్లో సరైన సిబ్బంది లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కోనరావుపేట, సుద్దాల, మామిడిపల్లి, వట్టిమల్ల, నిమ్మపల్లి ఆరోగ్య ఉప కేంద్రాల్లో మొదటి ఏఎన్ఎం లేరు. సుద్దాల, కోనరావుపేట, నిమ్మపల్లిలో ఎంఎల్‌హెచ్‌పీ లేరు. కోనరావుపేట ఉప కేంద్రంలో మొదటి ఏఎన్ఎం, రెండో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ అన్నీ ఖాళీగా ఉన్నాయి.

ప్రారంభించారు.. వదిలేశారు



కోనరావుపేట మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రం భవనాలను ప్రారంభించి వదిలేశారు. ఇందులో పనులు కూడా పూర్తి కాలేదు. గ్రామాల నుంచి ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే వృద్ధులు, వికలాంగులు వెళ్లలేని పరిస్థితి. గ్రామాల్లో నిర్మించిన ఉప కేంద్రాలను త్వరగా వినియోగంలోకి తేస్తే ఈ ప్రాంత ప్రజలందరికీ ఉపయోగకరంగా ఉంటుంది.

– గంగసాని రమణారెడ్డి, కోనరావుపేట



ఈ చిత్రంలో అందంగా కనిపిస్తున్న ఆరోగ్య ఉప కేంద్రం కోనరావుపేట మండల కేంద్రంలోనిది. ఈ భవనాన్ని 2023 జూన్ 19న అప్పటి ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఆర్భాటంగా ప్రారంభించారు. ప్రారంభించి ఏడాదిన్నర అవుతున్నా ఇప్పటివరకు ఈ భవనం వినియోగంలోకి రాలేదు. ఆరోగ్య కేంద్ర భవన ప్రారంభంతో తమ దూరాభారం తగ్గిందని భావించిన వృద్ధులు, వికలాంగులకు నిరాశే ఎదురవుతోంది. ఇదొక్కటే కాదు.. మండలంలో నిర్మించిన అన్ని ఆరోగ్య ఉప కేంద్రాలదీ ఇదే పరిస్థితి.

అప్పగించలేదు



మండలంలో మొత్తం 8 ఆరోగ్య ఉప కేంద్రాలున్నాయి. ధర్మారం, నిమ్మపల్లి, నిజామాబాద్ గ్రామాల్లో సొంత భవనాలుండగా.. నాలుగు గ్రామాల్లో భవనాలు నిర్మించి ప్రారంభించారు. పూర్తిస్థాయిలో పనులు కాలేదని పంచాయతీరాజ్ అధికారులు ఇప్పటివరకు మాకు అప్పగించలేదు. పూర్తి చేసి మాకు అప్పగించాలి.

– డాక్టర్ వేణుమాధవ్, కోనరావుపేట వైద్యాధికారి



ముస్తాబాద్: గూడెం–కొండాపూర్ గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రహదారి ప్రమాదకరంగా మారింది. గూడెం శివారులో ఒర్రె వద్ద భారీ వరదలకు రహదారి కొట్టుకుపోగా.. భారీ గుంత ఏర్పడింది. గుంతను దాటి వెళ్లే క్రమంలో ఒర్రెలో పడిపోయే ప్రమాదముంది. ఇక్కడ ఎలాంటి ప్రమాద హెచ్చరిక సూచికల్లేవు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
నాగరాజు, డీఈఈ, ఆర్అండ్‌బీ, సెల్ నం: 9440818420

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి: రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం రుద్రంగి మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర యూనియన్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రుద్రంగి, చందుర్తి మాజీ జెడ్పీటీసీలు గట్ల మీనయ్య, నాగం కుమార్, పొద్దుపొడుపు లింగారెడ్డి, కాంగ్రెస్ రుద్రంగి మండల అధ్యక్షుడు తూము జలపతి, మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, గ్రామాధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తర్రె లింగం, రుద్రంగి మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత, నాయకులు ఎర్రం గంగనర్సయ్య, గండి నారాయణ, పల్లి గంగాధర్, ధర్న మల్లేశం, బైరి గంగమల్లయ్య, చిత్తిపాక మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సమావేశం

ఎల్లారెడ్డిపేట: వీర్నపల్లి మండల కేంద్రంలో ఈనెల 10న విద్యుత్ వినియోగదారుల ఫోరం మీటింగ్ ఏర్పాటు చేసినట్లు భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు నిమ్మ నారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని నారాయణపూర్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సెస్ పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఫోరంలో ఫిర్యాదు చేస్తే పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సెస్ కార్యాలయంలో ఈనెల 9న సోమవారం ఉదయం 10.30 గంటలకు విద్యుత్ ప్రజావాణిని ఏర్పాటు చేసినట్లు సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సెస్ ఏఈ పృథ్వీధర్‌గౌడ్ ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ప్రజావాణిని సెస్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండల కేంద్రం రైతు వేదికలో ఈనెల 10న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు గంభీరావుపేట సబ్ డివిజన్ పరిధిలో ఉన్న గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ చైర్‌పర్సన్ ఇ.నారాయణ తెలిపారు.

ముస్తాబాద్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి ముస్తాబాద్ సెస్ సేవాసదన్‌లో విద్యుత్ ప్రజావాణిని సోమవారం నిర్వహించనున్నట్లు సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఏఈ విష్ణు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ సమస్యలపై అన్ని గ్రామాల వినియోగదారుల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు.

బోయినపల్లి: మండల కేంద్రంలోని సెస్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు సెస్ ఏఏఈ ప్రశాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కోనరావుపేట: మండల కేంద్రంలోని సెస్ కార్యాలయంలో సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఏఈ దివ్య తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

గోవులను తరలిస్తున్న వ్యాన్లను అడ్డుకున్న నాయకులు

తంగళ్లపల్లి: డీసీఎం వ్యాన్లలో గోమాతలను తరలిస్తున్నారనే సమాచారంతో బీజేపీ తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం రాత్రి రెండు డీసీఎం వ్యాన్లను అడ్డుకున్నారు. మండల కేంద్రంలోని తాడూర్ చౌరస్తాలో వ్యాన్లను అడ్డుకొని గోవులను తరలిస్తున్నట్లు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. తాడూర్ చౌరస్తాకు పోలీస్ సిబ్బందితో చేరుకున్న ఎస్సై రామ్మోహన్ రెండు డీసీఎం వ్యాన్లలో ఉన్న గోవులను పరిశీలించి వ్యాన్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తరలిస్తున్న వారిని వివరాలు అడగగా.. జగిత్యాల జిల్లా కిష్టంపేట నుంచి సిద్దిపేట జిల్లా దూల్మిట్టకు డైరీ ఫాంకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలు సేకరించిన అనంతరం చట్టబద్ధంగా డైరీ ఫాంకు తరలిస్తే వదిలేస్తామని, అక్రమ రవాణాకు పాల్పడినట్లు గుర్తిస్తే కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

ఎల్లారెడ్డిపేటను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేటను రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని ప్రజా సంఘాల నాయకులు ఖానాపురం లక్ష్మణ్, ఎడ్ల రాజుకుమార్, మారవేణి రంజిత్‌కుమార్, ఒగ్గు బాల్‌రాజయాదవ్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేటలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి నాలుగు మండలాలను కలుపుతూ ఎల్లారెడ్డిపేటను రెవెన్యూ డివిజన్‌గా చేయాలని గత ప్రభుత్వం ప్రతిపాదనలు పూర్తి చేసినట్లు తెలిపారు. గతంలో అన్ని రాజకీయ పార్టీలు ఒక్క తాటిపైకి వచ్చి రెవెన్యూ డివిజన్ కోసం అనేక ఉద్యమాలు చేశాయన్నారు.

విద్యుదాఘాతంతో మేకలు, గొర్రెలు మృతి



మృతిచెందిన మేకలు, గొర్రెలు

ఎల్లారెడ్డిపేట: రాచర్లగుండారం గ్రామానికి చెందిన గిరిజన మేకల కాపరి మూడావత్ భీంరావునాయక్ చెందిన మేకలు, గొర్రెలు ఆదివారం విద్యుదాఘాతానికి గురయ్యాయి. ఈ ప్రమాదంలో మూడు మేకలు, మూడు గొర్రెలు, రెండు కుక్కలు మరణించాయి. సదరు రైతుకు రూ.80వేల నష్టం వాటిల్లింది. భీంరావునాయక్ ఇంటితోపాటు మరో మూడు ఇళ్లను కలిపి బాధితుడి ఇంటి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి 25 కేవీ డీటీఆర్ బిగించి దాని ద్వారా సెస్ అధికారులు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. విద్యుత్ స్తంభానికి ఆనుకొని భీంరావునాయక్ గొర్రెలు, మేకల కోసం పాక వేశాడు. ఆ పాక చుట్టు ఇనుప జాలి ఏర్పాటు చేశాడు. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షం జల్లులకు విద్యుత్ సరఫరా అయ్యే క్రమంలో ఇనుప జాలికి కరెంట్ షాక్ తగలడంతో పాకలో ఉన్న మూడు మేకలు, మూడు గొర్రెలు, రెండు కుక్కలు మృతిచెందాయి. భీంరావు నాయక్ ఈ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. విషయం తెలుసుకున్న ఏఈ పృథ్వీధర్‌గౌడ్, లైన్ ఇన్‌స్పెక్టర్ దేవయ్య, లైన్‌మెన్ మహేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు బండారి బాల్‌రెడ్డి, బుచ్చాగౌడ్, రాజేందర్, రాజునాయక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితున్ని ఆదుకుంటామన్నారు.


వైద్యమందక ఆవు మృతి



మృతిచెందిన ఆవు వద్ద రైతు ఎల్లారెడ్డి

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో సకాలంలో వైద్యమందక ఆవు మృతిచెందిందని పాడి రైతు బొమ్మెళ్ల ఎల్లారెడ్డి ఆదివారం ఆరోపించాడు. పశు వైద్యాధికారుల నిర్లక్ష్యంతోనే తన ఆవు మృతిచెందిందని ముస్తాబాద్‌లో పశు వైద్యశాల ఎదుట ఆవు కళేబరంతో ఆదివారం రాత్రి ఎల్లారెడ్డి ధర్నా చేపట్టాడు. నెలలు నిండిన ఆవుకు అత్యవసర స్థితిలో వైద్యం కోసం ముస్తాబాద్ ప్రభుత్వ వైద్యశాలకు వెళ్తే అక్కడ అటెండర్ మాత్రమే ఉన్నారని తెలిపాడు. వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉండడంతో ఎవరూ వైద్యం అందించలేదని పేర్కొన్నాడు. గోపాల మిత్ర ద్వారా ఆవుకు వైద్యం చేయించామన్నారు. ఆవుకు ఆపరేషన్ అవసరం ఉందని తెలిపారని, కోరుట్ల పశు వైద్య కళాశాలకు ఆటోలో ఆవును తరలించగా అక్కడ కూడా వైద్యులు అందుబాటులో లేక తిరిగి ముస్తాబాద్‌కు వచ్చామని అన్నారు. మెరుగైన వైద్యం అందక ఆవు మృతిచెందిందన్నారు. రాత్రి ఆవు కళేబరంతో పశు వైద్యశాల ఎదుట ధర్నా చేయడంతో వివిధ పార్టీల నాయకులు పరామర్శించారు. రాత్రి రైతు బాధను వినేవారు కరువయ్యారని నాయకులు పేర్కొన్నారు. ఈ విషయమై జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ముస్తాబాద్‌లో పశు వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉందని, సిరిసిల్లలో పశువులకు ఆపరేషన్ చేసే థియేటర్, ఇతర ఏర్పాట్లు లేవన్నారు. కోరుట్ల కళాశాల వైద్యులు కరీంనగర్‌లో క్యాంపులో ఉన్నారని వివరించారు. ఆవును కరీంనగర్‌కు తీసుకొస్తే ఆపరేషన్ చేసే అవకాశముండేదన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎం మృతి



రత్నాబాయి(ఫైల్)

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల జిల్లాపరిషత్ బాలికల పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా సేవలందించిన రిటైర్డ్ హెచ్‌ఎం రత్నాబాయి మృతిచెందారు. ఆమె నివాస ప్రాంతమైన కరీంనగర్‌లో అంత్యక్రియలు జరిగాయి. 1990 దశకంలో ఆమె హెచ్‌ఎంగా విధి నిర్వహణలో అప్పటి డివిజన్, ప్రస్తుత రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా కీర్తి గడించారు. పాఠశాలలో చదివిన ఆమె శిష్యులు చాలా మంది అన్ని రంగాల్లో ఉన్నత రంగాల్లో స్థిరపడ్డారు. జిల్లాపరిషత్ బాలికల పాఠశాల హెచ్‌ఎం శారద, వృత్తి విద్యా ఉపాధ్యాయుడు ఎలగొండ రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళి అర్పించారు.

కాంగ్రెస్ యువజన నాయకులకు సన్మానం



ఎల్లారెడ్డిపేటలో సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ యువజన మండల ఉపాధ్యక్షులుగా ఎన్నికైన బానోత్ రాజునాయక్, కొండె రాజిరెడ్డిని ఆదివారం ఘనంగా సన్మానించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు బండారి బాల్‌రెడ్డి, గుండాడి రాంరెడ్డి, మెండే శ్రీనివాస్, ఎస్కే గౌస్, నంది కిషన్, పడిగెల రవీందర్ తదితరులున్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం



ఎల్లయ్యను సన్మానిస్తున్న నాయకులు

కోనరావుపేట: నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన కచ్చకాయల ఎల్లయ్యను మండల శాలివాహన కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. సుద్దాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువాతో సత్కరించి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. శాలివాహన సంఘం అధ్యక్షుడు వంగపెల్లి పర్శరాములు, మాజీ ఉప సర్పంచ్ వంగపెల్లి దేవరాజు, బిక్కనూరి భూమలింగం, మొగిలిపాలె మల్లేశం, వంగపెల్లి బాలయ్య, రామచంద్రం, రాములు తదితరులు పాల్గొన్నారు.

దేశ అభివృద్ధే లక్ష్యం



ఆంజనేయులును సన్మానిస్తున్న నాయకులు

ఇల్లంతకుంట: భారతదేశ అభివృద్ధి, రక్షణ బీజేపీ లక్ష్యమని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమల్ల ఆంజనేయులు అన్నారు. ఇల్లంతకుంట కార్యాలయంలో మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. మండల కార్యకర్తలు శాలువాతో సన్మానించారు. మండల కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు చిమ్మనగొట్టు శ్రీనివాస్, నాయకులు సంతోష్, స్వామి, కోల సంతోష్‌గౌడ్, బత్తిని సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.